# తెగీ తెగని జ్ఞాపకాలు

ఆ మొహం అలా పెట్టారెందుకూ: బెల్లం కాఫీ ఇచ్చానేనా.?

అల్లం పెసరట్టుకి బెల్లం కాఫీయే నప్పుతుంది.

ఉల్లం రంజిల్లేలా వక్కపొడి వేసుకుని కుక్క పిల్లతో ఆడుకోండి:

వెండికంచంలో వేడిబువ్వ వేసుకుని (మంచంమీద) మజ్జిగ పోసిన ఆవకాయన్నం తింటూ అచ్చు తప్పులులేని పత్రిక చదువుకోడ అదృష్టంగా భావించాలి.

ఏమిటో ఈవాళ కూర్చుని ఈరోటి దగ్గర పెసరపప్పు పచ్చడి రుబ్బుతుంటే నాకనేకానేక భావాలొస్తున్నాయ్. ఈరుబ్బుడంమానేస్తే ఆభావాలు రావడం మానేస్తాయ్.

కొన్ని భావాలు బరువుగా చూరు పట్టుకు వేలాడు తున్నట్లుంటాయ్

కొన్ని ఆవాల్లా అద్దంమీద పరిగెడతాయ్.

మనంహనీమూన్ కెళ్ళాం గుర్తుందా? అదేనండి తణుకులో మీ వాళ్ళింట్లో మేడమీద శుభ్రంగా పందరపాక దుప్పటి పరిస్తే పడుకో లేక- తేనెసీసా పట్రమ్మన్నారు.

“హనీమూన్ అంటే తేనెసీసా పట్టుకుని వెన్నెట్లో డాబామీద కూర్చోడం అని చెప్పారు.

దొరలు అలా పెళ్ళి అదీ అయాక చేస్తారని చెప్పారు. అన్నీ అబద్ధాలే—

హనీమూనంటే - కాఁయంట:

అప్పారావు చెల్లెలు జాకీ (దాని అసలుపేరు జానకి - "నా" వూడదీసి ఏడిపిస్తూంటారు) చెప్పింది. మనవాళ్ళు తలుపులుమూసి ఓగదిలోతోసి నక్కుకు పీక్కు- ఛావండర్రా - మీకర్మమీది అంటారు.

దొరలు పీక్కుంటూ నక్కుకుంటూ ఓ మూలపడి చావక, వూరూరా తిరుగుతారట - మేనమామా మొగుడూ పెళ్ళాలమని.

మనవాళ్ళు ఓమూడు రోజులు వాళ్ళింట్లోనూ ఓ మూడురోజులు వీళ్ళింటోనూ అఘోరించి ఆ తర్వాత మీ కర్మ మీ దర్రా పొమ్మంటారు. ఆశుభకార్యం దొరలు వూరూరా సాగించుకుంటూ విలాసంగా తిరుగుతారట.

తి:గాల్సిందే మరి .... ఇంత కథా కమామీషు వుండగా తణుకు చుట్టా లింటికెళ్ళ —

"వక్క-పొడి-కుక్క-పిల్లా' అన్నట్లు కాఫీ త్రాగి, వక్క-పొడి వేసుకుని, కుక్క-పిల్లతో ఆడుకుంటూ సాయంత్రాలు షికార్లుతిరిగొచ్చి - డాబా మీదకు పేకాడుకుందుకు రమ్మనిపిల్చి తేనెసేసా పత్రమ్మంటారూ?

చదువుకోకపోతే అంత లోకువన్నమాట!

ఎమ్మెనో బియ్యేనో చదివిన అమ్మాయిని అట్లా అనండి చూద్దాం!

అప్పుడు నాకు ఇంగ్లీషు బాగారాదు కనుక ఇంగ్లీషులో వేళాకోళం చేయగలిగారు.

ఆవేళ రైల్లోమీపప్పులేం వుడకలేదు. గొప్ప దర్జాగా సెకండ్ క్లాస్ టిక్కెట్టు కొన్నారు. అంటె ఇప్పటి ఫస్టక్లాస్ పూర్వం సెకండ్ క్లాసండోయ్.

ఇప్పుడన్నీ అంతేలేండి.

టి. టి సి. .... మిమ్మల్ని దబాయించాడు. ఈ పిల్లనెవర్నో ఎత్తుకొస్తున్న బాపతు అన్నట్లుచూశాడు మీకేసి. మీ కర్థం కాలేదు కాని. నేను పరికిణీ కట్టుకున్నాను.

మీరు పాంటుతొడుక్కుని బైతులా చొక్కా మోకాళ్ళ కిందకి పైన వేసుకున్నారు.

ఆ సిల్కు చొక్కా ఆ వుంగరాల జుత్తూచూసి ఏడిపిద్దామనుకున్నాడు టి. టీ. సి.

ఇది మెయిలు మీ టిక్కెట్లు ప్యాసింజరు కున్నాయి డబ్బుకట్టమ న్నాడు.

మీ దగ్గర డబ్బేది? తెల్లమొగం వేశారు. పోనీ-పాపంగదా అని ట్రంకు పెట్టె తీసి ట్రాఫీలపెట్టెలోదాచిన పూసల మనీపర్సులోంచి పదిరూపా యల నోటు తీసి మీకు "అప్పు" పెట్టాను.

ఆ టిక్కెట్లవాడు ఆ పదిరూపాయలూ లంకించుకుని ఏదో కొంత చిల్లర, ఇన్ని కాగితం ముక్కలూ మీ చేతిలో పెట్టాడు.

ఆ రైల్లో మీరు మెడ ఇవతలకి పెట్టడం—ఆ పక్క పక్క కిటికీ లోంచి చేతులూపుకుంటూ వెనక్కు పరుగెట్టుకు పోయే చెట్లు చేమల్ని చూస్తూ ఆ టకటక చప్పుళ్ళకు ఉత్తేజపడిపోతూ మధ్య మధ్యన చలి మిడి జంతికలు, బటాణీలు, తింటూ కాఫీ మరియు సోడా త్రాగుతూ ఎట్ట కేలకు విశాఖపట్నం వచ్చి పడ్డాము. ఆ రాత్రి పదకొండున్నరకు రైలు ప్లాటు ఫారం మీదకు వచ్చి ఆగింది.

వాల్తేరు స్టేషన్నుంచి లలితానగరం జైలురోడ్డువరకు పెట్టిబండిలో మనిద్దరం కూర్చుని బాలా కులాసాగా వెళ్ళాము.

మన్నెవ్వరూ చూడ్డం లేదనుకుని చాలా ఖుషీగా చేతులూపుకుంటూ తిరిగాము.

ఆ వేళ ఆ పెట్టిబండీలోకి పడిన వెన్నెల్లో కిలా కిలా నవ్వు కుంటూ - ఇంటికి వెళ్ళిన ఆనందం మరపురాదు.

మీరూ నేనూ సరదాగా - తెలిసీ తెలియని వయసులో అజ్ఞానంగా ఆ పెట్టి బండిలో కేరింతలు కొడుతూ ఇంటికి చేరేసరికి ఆ ముఖాల్లోని తళ తళ కాంతిని చూసి అంతా చుట్టూమూగి మనకు హారతిచ్చి దిష్టి నీళ్ళు తీసి లోపలికి తీసుకెళ్ళారు.

అప్పుడు మీ దగ్గర పెట్టి బండివాడి కివ్వడానికి ముప్పావలా లేదు. అర్థరూపాయే వుంది. అప్పుడు మరో పావలా అప్పుపెట్టాను. నీ దగ్గర డబ్బులన్నీ లాగేస్తాడే వాడు-మరివ్వకు అని అంది అత్తయ్య. అలాగే అయింది పది లాగెయ్యలేదు అంతా లాగేశారు.

అలనాడు పెట్టి బండిలోకి వెన్నెలలు కురిపించిన చందమామ ఇప్పుడు చాపమీద వరసాగ్గా పడుకున్న సైజుల వారీ సంతానం మీద వారి ముఖాల మీద చిరునవ్వుల వెన్నెలలు కురిపిస్తోంది: దేవుడా వారి ముఖాల మీదకు చీకటి చారికలు పడనీయకు.

చీకటి చారికలు వద్దు:

ఇలా పచ్చడి రుబ్బుకుంటూ తెగీ తెగని జ్ఞాపకాలను నెమరు వేసుకుంటుంటే మనస్సుఏదోలా పరవశించి పోతుంది. గాలికి ఎటో ఎటో తేలిపోతున్నట్లు వుంటుంది.

అప్పుడు మనం బీచ్చికి వెళ్ళేవాళ్ళం

బీచ్చి దగ్గర వేరుశనక్కాయలకి బేడా అప్పుపెట్టాను.

అప్పుడు మీకు కథ వ్రాసిన డబ్బొస్తే .... నన్ను లైటు హవుస్ దగ్గర ఇంగ్లీషుసినిమాకి తీసుకెళ్ళారు. అదేనేమో మొదటిసారి ఇంగ్లీషు సినిమా చూడ్డం. ఒళ్ళంతా కంపరమెత్తి పోయిందంటె నమ్మండి

మాటలు ఎలాను తెలీవుకదా! ఆ మాట్లు మీక్కూడా అర్థమయి వుండవులెండి. (ఆ ఏడు ఇంగ్లీషులోనేగా పరీక్ష పోయిందీ) ఆ ఆడ వాళ్ళు మొగవాళ్ళు ఒకళ్ళమీదొకళ్ళు పడిపోవడ మేనా. పూరిషే ముద్దు లెట్టేసు కోవడమేనా ....శ్రీరామ రామా - ఇంటికొచ్చాక స్నానం చేయా లని పించింది. ఎవడు తండ్రో. ఎవడు అన్నగారో. ఎవడుభర్తో తెలి సేదవదు. అత్తయమొగం చూడలేక పోయాను. మహా పాపం చేసినట్లు

ప్రహ్లాదో యోగి వేమనో పిక్చరు చూసేవరకు పుణ్యాహవచనం అయింది కాదు.

అబ్బ— ఏవిటో జ్ఞాపకాలూరికే వస్తూన్నాయ్ ఈ పచ్చడి రుబ్బుతుంటె.

ఈ రుబ్బడం మానేస్తే ఈ జ్ఞాపకాలు రావడం మానేస్తాయ్ కాబోలు.

ఇదిగో ఏమండోయ్ .... మిమ్మల్నే పెసరపచ్చడి రుబ్బుతుంటె ఇలాటి భావాలు జ్ఞాపకాలొస్తున్నాయిగదా— కంది పచ్చడి రుబ్బుతుంటె ఇంకెలాంటి భావాలొస్తాయో?

మాటాడరేవండి? బెల్లం కొట్టిన రాయిలాగా (క్షమించాలి: బెల్లం కాఫీతాగిన అని వుండాలి.)